క్లుప్తంగా

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



వెల్దండ: మండలంలోని రాచూర్‌లో శివాజీ విగ్రహ ఏర్పాటుకు గ్రామస్తులు గురువారం భూమి పూజ చేశారు. హిందువుల మహనీయుల చరిత్రలను భవిష్యత్ తరాలు తెలుసుకునేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సాంబయ్యగౌడు, బండ శ్రీశైలం, పబ్బాల బాలకృష్ణ, శ్రీశైలం, గుత్తి బాలకృష్ణ, నరసింహరెడ్డి, గంగాధర్‌రావు, సురేష్‌రెడ్డి, గణేష్, వెంకటేష్, గున్నెల శ్రీను, గంగదారి రమేష్, పర్వతాలు, రాజు, శ్రీను, దుబ్బరాజు, సాయికుమార్, గుత్తి సుధీర్ ఉన్నారు.

దాసరి అక్షయ్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్



మన్ననూర్: నల్లమల ప్రాంతం మన్ననూర్ గ్రామానికి చెందిన డిగ్రీ కళాశాల అధ్యాపకుడు దాసరి అక్షయ్‌కుమార్‌కు గురువారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. తెలంగాణ యూనివర్సిటీ హైదరాబాద్‌లో నిర్వహించిన స్నాతకోత్సవంలో 2025 సంవత్సరానికి గాను ఎంఏ ఇంగ్లీష్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అక్షయ్‌కుమార్‌కు అవార్డు దక్కింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సంతోషం వ్యక్తం చేశారు.

మౌలిక వసతులు కల్పించాలి

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రాచూర్ గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, రాచూర్‌తండా పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గణితం, సోషల్ సబ్జెక్టులకు బోధించి ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. పాఠశాలకు జీహెచ్‌ఎంను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విజయ్ కుమార్, నితిన్, మల్లేష్, కార్తీక్, రామ్, సిద్ధు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మన్ననూర్: అమ్రాబాద్‌లోని 33 కేవీ పరిధిలో ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అమ్రాబాద్, పదర మండలాల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు. వ్యాపార, గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

గోరింటాకు సంబురం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వైఆర్‌ఎం కళాశాలలో గురువారం గోరింటాకు సంబురం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మేకల రాజేందర్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలన్నారు. గోరింటాకు పెట్టుకోవడం ద్వారా ఆరోగ్యం కలుగుతుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సదానందం గౌడ్, ప్రవల్లిక, సంధ్యారాణి, యాదయ్య, వెంకటయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీకల్లును అరికట్టాలి

నాగర్‌కర్నూల్ రూరల్: కల్తీకల్లు అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభుడు ఆర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో కల్తీ కల్లు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాదిల రామయ్య, నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

తిమ్మాజిపేట: నాగర్‌కర్నూల్ పట్టణంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జోగు ప్రదీప్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్లు, ద్విచక్ర వాహనాలతో బయలుదేరారు. తరలినవారిలో మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచులు గోపిగౌడ్, సత్యం, మురళీధర్‌రెడ్డి, బొందయ్య, నాయకులు ఉన్నారు.

మహిళలకు బీమా.. ధీమా

- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం
- మహిళా సంఘాల సభ్యుల హర్షం



వెల్దండలో ప్రభుత్వ పథకాలపై మహిళ సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

వెల్దండ: మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాలకు ప్రభుత్వం తీపిక బురు చెప్పింది. వారి ప్రమాద బీమాను ప్రభుత్వం 2029 సంవత్సరం వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రమాద సమయంలో భరోసా ఇచ్చింది. సంఘంలోని సభ్యులుగా ఉన్న వారిలో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ప్రభుత్వం రూ.10 లక్షల వరకు బీమా పరిహారం పొందే సౌలభ్యం ప్రభుత్వం కల్పించింది.

మండలంలోని 812 సంఘాలు

మండలంలోని 32 గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 812 మహిళ సంఘాలు ఉన్నాయి. 24 వికలాంగుల సంఘాలు ఉన్నాయి. ఆ సంఘాల్లో 8803మంది సభ్యులు ఉన్నారు. మహిళలు బ్యాంక్ లింకేజీ ద్వారా, శ్రీనిధి ద్వారా సభ్యులు రుణాలు పొందుతూ స్వయం ఉపాధి అవకాశాలు ఎంచుకొని రాణిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయా యూనిట్లను ద్వారా ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద బీమాను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ బీమా పథకం శ్రీనిధి ద్వారా అమలు జరుగుతుందని ఏపీఎం ఈశ్వర్ పేర్కొంటున్నారు.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు

జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మహిళ సంఘాలతో గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సంఘాల్లో చేరాలంటే 18 ఏళ్ల వయస్సు నుంచి 59 ఏళ్ల వయస్సు వారు స్వయం సహాయ సభ్యురాలిగా ఉన్నవారికి బీమా వర్తిస్తుంది. పథకాన్ని గతేడాదిలో మార్చి 14 ప్రభుత్వం ప్రారంభించిదన్నారు. బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి ద్వారా రుణాలు తీసుకున్న వారు మరణిస్తే వారి కుటుంబాన్ని ఆర్థికంగా ప్రభుత్వం అందుకుంటుందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంక్ లింకేజీ రుణాలతో పాటు శ్రీనిధి రుణాలను అందిస్తున్నారు. వారు స్వశక్తితో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తున్నారు. సభ్యులందరికి ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుంది. సభ్యులు రుణాలు పొంది సాధారణంగా మరణిస్తే వారు మిగిలిన డబ్బులు చెల్లించకుండా ప్రభుత్వం డబ్బులు చెల్లించి మాఫీ చేస్తుంది. వారికి రూ.2లక్షల వరకు రుణాలను ప్రభుత్వం భరిస్తుందన్నారు. సభ్యులు ఎదైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి కుటుంబానికి నామినికి రూ.10లక్షల బీమా అందిస్తుందన్నారు. వారికి సంబంధించిన రుణమాఫీ చేస్తారు. 50 శాతం మించిన అంగవైకల్యం ఏర్పడితే సదరం ధ్రువపత్రం ద్వారా పరిశీలించి రూ.5లక్షలు అందజేయనున్నారు.

ఇప్పటివరకు 12 మందికి లబ్ధి

ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 12మంది మహిళలకు రుణమాఫీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలోని రాచూర్, చల్లపల్లి, చెర్కూర్, వెల్దండ, అజిలాపూర్, అంకనమోనికుంట, చెదురుపల్లి, పెద్దాపూర్ గ్రామాలకు చెందిన మహిళలు సాధారణ మరణం పొందారు. వారికి ప్రభుత్వం రూ.5.40లక్షల రుణాలను మాఫీ చేసినట్లు అధికారులు వివరించారు.

రూ.19 కోట్లకుపైగా రుణాలు

మండలంలోని ఆయా మహిళ సంఘాలకు ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు దాదాపుగా రూ.18 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేశారు. బ్యాంకు రుణాలు 45 సంఘాలకు రూ.5.52 కోట్లు రుణాలు అందించినట్లు అధికారులు వివరించారు. అదే విధంగా శ్రీనిధి రుణాల ద్వారా 40 గ్రామ సంఘాల్లోని 1511మంది సభ్యులకు రూ.13.65కోట్లు మహిళ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



గ్రామాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. ప్రభుత్వ పథకాలను మహిళ సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. బ్యాంక్ లింకేజీలు, శ్రీనిధి ద్వారా రుణాలు పొంది కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలబడాలి. పిల్లలను ఉన్నత చదువులను చదివించుకోవాలి. ఇటీవల నిర్వహించిన మహిళ సంబరాల్లో రుణాలపై మహిళలకు అవగాహన కల్పించాం.

–భారతమ్మ, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, వెల్దండ

నూతన సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం



మహిళలు నూతన సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి. సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను అందిస్తాం. బ్యాంకు రుణాలు పొంది ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది. మహిళలు స్వశక్తితో ఎదిగేలా ప్రభుత్వం చేస్తుంది. ప్రమాదశాత్తు సభ్యులు మరణిస్తే వారి కుటుంబానికి రూ.10లక్షల బీమా అందజేస్తుంది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా ఉంటుంది.

–ఈశ్వర్, ఏపీఎం, వెల్దండ

బీసీ రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారం తగదు

మన్ననూర్: బీసీ రిజర్వేషన్లపై బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఆపాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరిగౌడ్ కోరారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు కేటాయింపు ఉంటుందని బీజేపీ నాయకులు చెప్పడంలో వాస్తవం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గిస్తే బీజేపీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుంటే ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

ఆక్రమణల తొలగింపు..అధికారులతో వాగ్వాదం



వాగ్వాదం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

అచ్చంపేట రూరల్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వెలసిన ఆర్టీసీ బస్టాండు కాంప్లెక్స్ దుకాణ సముదాయం ఎదుట ఆక్రమణలను ఆర్టీసీ అధికారులు, సిబ్బంది గురువారం తొలగించారు. ఆర్టీసీ బస్సులు నిలపడానికి కూడా స్థలం లేకుండా రోడ్డుపైనే ఆక్రమణదారులు వ్యాపారాలు సాగిస్తున్నారు. అలాగే కాంప్లెక్స్‌లోని దుకాణాలకు అడ్డంగా ఉండటంతో వ్యాపారాలు సాగడం లేదు. దీంతో కాంప్లెక్స్‌లోని దుకాణాదారులు అద్దెలు చెల్లించేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో రంగంలోకి దిగిన ఆర్టీసీ అధికారులు, సిబ్బంది గురువారం అక్రమంగా ఏర్పాటు చేసుకున్న వాటిని తొలగించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భర్త విష్ణువర్ధన్‌రెడ్డి ఆక్రమణదారులకు మద్దతుగా నిలిచి ఆర్టీసీ అధికారులు, సిబ్బందిపై చిందులు వేశాడు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆక్రమణదారులకు మద్దతు తెలపడం ఏంటని పలువురు ప్రశ్నించారు. దీంతో ఆయన తీరుపై ఆర్టీసీ డీఎం మురళీదుర్గాప్రసాద్, సిబ్బంది, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారికిరువైపుల అక్రమంగా, అనుమతి లేకుండా వెలసిన తోపుడుబండ్లు, ఇతర వ్యాపారాలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు సామగ్రి అందజేత

కందనూలు: నాగర్‌కర్నూల్ మండలం బొందలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన బండారు ఆనంద్ గురువారం నోట్‌బుక్స్, పలకలు, గ్లాసులు, ప్లేట్స్, స్పోర్ట్స్ కిట్లను సమకూర్చాడు. ఈ మేరకు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి విద్యార్థులకు సామగ్రి అందజేశాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, సంగీత, శ్రీవాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోడల్ అధికారి ఆకస్మిక తనిఖీ



అధ్యాపకులతో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ

తిమ్మాజిపేట: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ, అధ్యాపకులతో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తిమ్మాజిపేటలో ఇంటర్ చదివేందుకు స్థానికంగా వసతి గృహాలు(హాస్టల్) లేకపోవడం, గ్రామాల నుంచి మండల కేంద్రానికి సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గినట్లు వివరించారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు పాఠాలు బోధిస్తారన్నారు. అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల ధర్నా



కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల కురుమయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల పెన్షన్ రూ.6000 ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మూసివేసిన టీసీపీసీ సెంటర్లను తెరవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సింధు

వెల్దండ: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని వైద్యురాలు సింధు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలన్నారు. శుద్ధమైన తాగునీటిని తాగా లని సూచించారు. గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలన్నారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్రవంతి, వైద్య సిబ్బంది మురళీ, కృష్ణ, కవిత, జహంగీర్‌బీ, అనవరీబేగం, ఆశకార్యకర్తలు సుజాత, పద్మ ఉన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగుల ప్రాథమికోన్నత పాఠశాలలో 70 మంది విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లు, నోట్ పుస్తకాలు, స్టీల్ వాటర్ బాటిల్స్‌ను ఆవోపా అధ్యక్షుడు పాపిశెట్టి సతీష్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలయ్య గౌడ్, కార్యదర్శి యాద శోభన్ బాబు, గాదె కుమారస్వామి, ఉమాదేవి, రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహేంద్రనాథ్‌కు ఘన నివాళి



అచ్చంపేటలో మహేంద్రనాథ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: పట్టణంలో మాజీ మంత్రి మహేంద్రనాథ్ వర్ధంతిని కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్‌తో పాటు పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు ఎదుట ఉన్న మహేంద్రనాథ్ విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదుట ఉన్న మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ విగ్రహానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, కౌన్సిలర్ గౌరిశంకర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామనాథం, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, కాశన్న యాదవ్, మహబూబ్ అలీ, మహమ్మద్ రఫీ, ఖాదర్, రాములు, తిరుపతయ్య గౌడ్ శివప్రసాద్, పోలే రవి, మస్తాన్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని జొన్నలబొగడలో మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ 20వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన సమాధిపై మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడు, గ్రామస్తులు పూలమాల వేసి నివాళులర్పించారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



ఎంఈఓతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తాడూరు: మండలంలోని యత్మాతాపూర్ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో పాఠశాల నిర్వహణ, నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారని 5 తరగతులకు గాను ఒకే ఉపాధ్యాయుడిని నియమించారని మాజీ సర్పంచ్ కుర్మయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. మండలంలోని ఉన్న పాఠశాలల స్థితిగతులు తెలుసుకొని జాబితాను తయారు చేసి పంపించాలన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాములు, వినోద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్‌కు లేదు



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్

పెంట్లవెల్లి: రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక ఇటీవల బీఆర్‌ఎస్ మండల నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన విమర్శలను ఆయన ఖండించారు. స్థాయికి మించి మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పాలనలో సహకార సొసైటీలో దొంగ పాస్‌పుస్తకాలు సృష్టించి అక్రమంగా రూ.లక్షలు కాజేశారని దీనిని ఎవరు మర్చిపోలేదని గుర్తు చేశారు. మండలంలోని జటప్రోల్‌లో రూ. 183 కోట్లతో నియోజకవర్గంలో ఎక్కడలేనివిధంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నారన్నారు. సీనియర్ నాయకులు రామన్‌గౌడ్, నల్లపోతుల గోపాల్, కోట్ల సురేందర్, నర్సింహనాయుడు, ఎర్రశ్రీను, కుమార్, రవి, లింగస్వామి పాల్గొన్నారు.

మూడు దశల్లో పోరుబాటకు సిద్ధం



సభ్యత్వం అందిస్తున్న నాయకులు

చారకొండ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి మూడు దశల్లో పోరుబాటకు సిద్ధం అవుతున్నామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఎర్రోళ్ల చిన్నయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కరించకపోవడంతో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు పేర్కొన్నారు. 23న మండలాల్లో తహసీల్దార్లకు, 24న జిల్లా స్థాయిలో వినతిపత్రాలు అందిస్తామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే వచ్చే నెల 23న రాష్ట్రస్థాయిలో మహాధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్ నాయక్, కార్యదర్శి రాంబిక్షయ్య, గౌరవ అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, మధవి, గౌరవ సలహాదారులు రామకృష్ణ, నారాయణ, మండల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కోడేరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ భాస్కర్‌శర్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలన్నారు. 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అంతకుముందు విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి

కోడేరు: రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని కోరారు. అదే విధంగా గృహలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500ల చొప్పున ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. మండల కమిటీ సభ్యులు శివశంకర్, రవీందర్, బుచ్చ న్న, మాలిక్, బాలస్వామి, రాములు, శివ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా కురుమూర్తి

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108,102,1962 వాహనాల ఉద్యోగులు సంక్షేమ సంఘం నూతన జిల్లా అధ్యక్షుడు సల్వాది కురుమూర్తిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

తిమ్మాజిపేట: విద్యార్థులు మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కౌన్సిలర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల వినియోగం వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటరమణ, ప్రిన్సిపాల్ అనసూయ, అధ్యాపకులు వెంకన్న, వెంకటయ్య, జయలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలుచేయాలి

వంగూరు: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మంగ్యానాయక్ అన్నారు. గురువారం మండలంలోని గాజరలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా ఇస్తానన్న తులం బంగారు ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలాజీ, మండల నాయకులు ఆనంద్‌రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎండుముఖం పడుతున్న పంటలు



పెద్దకొత్తపల్లి: మండలంలో మొక్కజొన్న 2400 ఎకరాలు, పత్తి 340, కంది 8, మినుములు 2 ఎకరాల్లో సాగు చేసినట్లు మండల వ్యవసాయాధికారి శిరీష తెలిపారు. జూన్ నెలల్లో 80.06 మి.మీ. వర్షపాతం నమోదు కాగా జూలై నెలలో 123 మి.మీ. వర్షపాతం నమోదు అయ్యిందని పేర్కొన్నారు. 15 రోజుల నుంచి వర్షాలు కురువకపోవడంతో వానాకాలం పంటలు ఎండుమొఖం పట్టాయి. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. నీటి వసతి ఉన్న రైతులు స్ప్రింక్లర్ల ద్వారా పంటలను కాపాడుకుంటున్నారు. కేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరు వదలాలని రైతులు కోరుతున్నారు.

దళితులపై దాడులు అరికట్టాలని నిరసన



తాడూరు: దళితులపై దాడులను అరికట్టాలని గురువారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ ఇప్పటికీ దళితులకు దేవాలయ ప్రవేశం లేకపోవడం దారుణమన్నారు. ఒడిస్సా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ పలు రాష్ట్రాల్లో దళితులపై అధికంగా జరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్ష్మన్, బసవయ్య, ప్రభాకర్, కిషోర్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.